స్కెచ్

# పిల్లి దాంపత్యం

ఆవసరాల రామకృష్ణరావు

ఊళ్ళోకల్లా తిరిగి తిరిగి ఉసూరుమంటూ ఆ మొగమహారాజు యింటికొస్తే కాస్సేపు ఆప్యాయంగా ఆదరిస్తే ఎలా వుంటుంది? 'కంయ్‌' మని కాట్ల కుక్కలా మీదపడితే ఎలావుంటుంది?

"దేన్నిగురించి రాజ్యం ఈ ఉపాఖ్యానం?" అన్నాను వినివిని మరి ఉండబట్టలేక.

"చెప్పేదేముంది, రోజూ చూస్తున్న భాగోతమే. ముసిలాడయినా యింత సంసారమూ ఆయనమీదే నడుస్తోందా? ఆయన తెస్తే తిన్నట్టు లేకపోతే పడుకున్నట్టు. ఈ మాట కాస్త అర్థంచేసుకుని, మొగాడు, గడిస్తున్న వాడు-కోపంమీద ఏమాటైనా అన్నా ఊరుకోవలసిన మాట; అదిలేదు- పైగా యింటికొచ్చేసరికి "యిదిలేదనీ", "అది లేదనీ" అల్లరా? అతనెంతకని చస్తాడు చెప్పండి?"

"ఏమిటో, నీగొడవ నీదేగాని నామాట అర్థంచేసుకోవు. ఇదంతా ఎవరి గురించి?"

"అబ్బ- ఎంత వెర్రివారండీ. సేరు పాలు అక్కడ పెడితే నిముషంలో మచ్చుకేనా లేకుండా "నువ్వా, నేనా" అని ఊడ్చేసి- "పాలా? ఎలావుంటాయ్?" అని అడిగేరకం! మీరా సూరమ్మను పెళ్ళాడవలసింది. జోడీజోడీ సరిపోను."

రాజ్యం పకపక నవ్వింది. ఆనవ్వులవర్షంలో నామీద కొన్ని పిడుగులు కూడా రాల్చకపోలేదు. నేను తెచ్చిపెట్టుకున్న కోపంతో,

"ఊరుకో రాజ్యం. వాళ్ళెవరయినా వింటే బాగుండదు. అయినా నువ్వు మరీని. ఓ అనవలసినమాట లేదు, అనకూడనిదీ లేదు. ఆవిడ నాకు అక్కలాంటిది. తెల్లారి లేచి ఆ యిల్లాలికి ఓ నమస్కారం పెడితే సర్వపాపాలు పోతాయి."

రాజ్యానికి నిజంగా ఉక్రోషమొత్తనమే వచ్చింది. చేతులూ కళ్ళూ యాక్టివ్ "వెలా సిటీ"లో తిప్పుతూ.

"ఓహోహోహో! మహాపతివ్రతండీ, ఈనాటికి బయలుదేరింది! సమర్థించ వచ్చారు మహానుభావులు. నే అనుకుంటున్న విషయమే. నే "అవును" అంటే వెంటనే "కాదు" అనడం మీ కలవాటేగా! నన్ను ఏడిపించడం మీకు సరదా కాబోలు." మాపుడువేలుకి చీరకొంగు చుట్టి కళ్ళల్లో దోపింది ఏమయినా నీళ్ళు కారకపోతాయా అని.

"ఏమో సుమా! ఉన్నమాట అనడంలో నాకంత తప్పు కనిపించటం లేదు. తెల్లారి అయిందోగంటయే సకల్లా లేస్తుంది. ఇంటెడు నౌకరీ చేస్తున్న కష్టజీవి ఓ మాట విసురుతే విసురుతుంది. బుద్ధిమంతుడూ, తెలివయినవాడూ అయితే మొగాడు సరిపెట్టుకోవాలి గాని. మాటామాటా సాకులు చెప్పి రెచ్చగొట్టడం నాకంత మంచిపనిలా తోచడం లేదు" అనేసేను సుమండీ ఊరుకోలేక. రాజ్యం మాత్రం తక్కువదా? ఏక నడుంలోకి దోపి.

"సరే, అమాం అన్నారు కనుక ఆమాట మీదేనిలబడండి. ఎవరిది తప్పో మీకె మసుగుండానే చూపిస్తాను. అదిగో ఆ దెబ్బలాట కాస్త శ్రద్ధగా వినండి" అంది.

మాయింట్లో పెరట్లో గోడదగ్గర నుంచుంటే మా ప్రక్కయింటి దాసుగారి మాటలు స్పష్టంగా వినిపిస్తాయి. మేమిద్దరం గోడదగ్గరకు వెళ్ళి నిలబడ్డాం.

నామటుకు యిద్దరూ సరిగ్గా దెబ్బలాడుతున్నట్టే కనిపించింది. ఆడది కాబట్టి సూరమ్మగారి చేతులు మాటిమాటికీ దాసుగారి దవడకిందకీ, బుగ్గమీదకీ విసురుగా వెడుతున్నాయి. వీటన్నిటికీ సరిపోయినట్టు దాసుగారు పావు

గంటకో చరుపు చరవడం, తదనుగుణంగా సూరమ్మగారు "కుయ్యో" మనడం చెవుడు లేని మా యిద్దరికీ స్పష్టంగా వినిపిస్తూనే ఉన్నాయి.

"చూశావా రాజ్యం, ఎంతలా చెయి జేసుకున్నాడోను. ఎంతో బల మున్నవాడయినా అంతలా కొడతాడా?"

"మీలా ఊరుకోడానికి అందరూ దద్దమ్మలు కారు. మాటిమాటికీ చెయ్యి మీదమీదకి రానిస్తుంటే "పురుష అంశ" ఉన్నవాడెవడూ ఊరుకోడు"

"నోర్మూయ్"

"మీరే..." రాజ్యం మాట పూర్తి చెయ్యకుండా చెంప ఫెళ్లుమంది. కళ్లనీళ్లు పెట్టుకొని గదిలోకి వెళ్ళిపోయింది.

"ఎందుకు కొట్టేనా?"అని మొదట కొంచెం విచారించినా,

"లేకపోతే ఏమిటీ? ఎంతమాట పడితే అంతే. తగలవలసిందే"అని సరి పెట్టుకున్నాను. మూడురోజులు నాకూ రాజ్యానికీ మాటలు లేవు.

* * *

"ఏం కూతురా, అలా ఉన్నావు?"

"రండి, సూరమ్మగారూ" మనసునిండా కోపం తొణికిసలాడుతున్నా అంతా అణిచి పెట్టుకుని రాజ్యం ఆవిణ్ణ ఆహ్వానించడం గది లోంచి నేను చూడకపోలేదు.

రాజ్యంచాప వేసింది. ఇద్దరూ కూర్చున్నారు.

"మాట్లాడవేమే అమ్మాయీ, ఏం అలా ఉన్నావు?"

"ఏంలేదు దొడ్డమ్మగారూ"

మనిషి కనపడేసరికి తడముకోకుండా వరసలు కలపడం ఆడదానికి పుట్టుకతో వచ్చిన విద్య కాబోలు. దొడ్డమ్మట, ఏలాంటి దొడ్డమ్మో!

"ఒంట్లో బాగులేదా?"

"బాగానే ఉందే!"

"అబ్బాయి ఏమైనా అన్నాడా?"

క్షణంలో కోపంతోను ఆ సూయతో మారిపోయిన మా రాజ్యం ముఖ కవళికలు చూసి తీరాలి. చేతిలో పుస్తకం ముడిచేసి ఏమంటుందో అని అటు చూసేను.

"ఈ మధ్య చిన్న గొడవ జరిగింది లెండి"

"దేన్ని గురించో!"

ఎవరిగురించి మేం దెబ్బలాడుకున్నామో వారే వచ్చి మమ్మల్ని పరామర్శించడం, అందులో నేను వెనకేసుకొచ్చిన సూరమ్మ స్వయంగా ఏమీ ఎరగనట్టు అడగడం, స్త్రీ జాతికి చెందిన రాజ్యం భరించలేకపోయింది.

"దేన్ని గురించేమిటి? మీ గురించే!"

కొంత స్వంత కవిత్వంతో కొలది మార్పులతో రాజ్యంమాయిద్దరికలహ కారణంచెప్పింది.

"ఇది మరీ బాగుందే అమ్మాయోయ్, మేం దెబ్బలాడుకున్నామా? ఎప్పుడూ?"

అక్కడ కూర్చున్న రాజ్యానికీ, యిక్కడ్నుంచి వింటున్న నాకూ నోట మాటరాలేదు.

"అదేమిటి దొడ్డమ్మగారూ, మరి రోజూ వినిపిస్తున్న కేకలేమిటి?"

"ఏ కేకలూ?"

"మేం కళ్ళతో చూస్తేనే! అలా కొట్టిపారేస్తే ఎలాగండీ, మా ఆయన్ని పిలుస్తానుండండి."

"నాకూ ఆశ్చర్యంగానే ఉంది మరి. మీ బాబాయిగారు యింట్లోనే ఉన్నట్టున్నారు. పిలుచుకువస్తానుండు."

అంతలో అంతె ఎవరు ముందు మాట్లాడ్డమా అన్న సమస్యరావడం, ఆఖరికి అనసరం కొద్దీ ఆవిడే ఓడిపోవడం, నన్ను తీసుకువెళ్ళేసరికి సూరమ్మగారు దాసుగార్ని వెంటపెట్టుకు రాడం, సినిమా రీల్సులా జరిగి పోయేయి. సూరమ్మగారు ఎడం చెయ్యి నడుంమీద వేసి, కుడిచేత్తో దవడ నొక్కుకుంటూ ఇలా అంది:

"ఏమండోయ్ - యీ కబురు విన్నారా?"

"ఏమిటది?"

"మనిద్దరం తెల్లారిలేస్తే కొట్టుకు చస్తున్నామట"

"ఎవరన్నారూ?"

నేనూ రాజ్యం ఒకరి మొహం ఒకరు చూసుకున్నాం.

"ఏమిటమ్మాయ్. మీరేనా యేమిటి ఈ మాట అంట?"

"ఉన్న మాట అంటే ఉలుకెందుకు బాబయ్యా?"

"అన్నది చాలక పైగా యిదొకటా? మేమూ మేమూ లక్ష అనుకుంటాం. హాస్య ధోరణిలో అనేకం జరుగుతాయి. మీకెందుకు?"

రాజ్యం నోట మాటలేదు. నేకలుగ చేసుకోక తప్పలేదు.

"మాకు తెలియదు దాసుగారూ. అందరూ మాలాగే వీథిని పడిపోతారనుకున్నాం. మాది తప్పే. మీ హాస్యధోరణి ఇంత వికృతంగా ఉంటుందనుకోలేదు."

"వికృతంగానా? ఆమాట మళ్ళీ అను."

"పోనీండి బాబూ, బహు సున్నితంగావుంది సరా? యిక మీరు వెళ్ళండి నాయనా."

"జరిగిందేదో జరిగింది - యీ సారి మా స్వవిషయాలలో కలుగచేసుకున్నారంటే మాటలతో సరిపోదు-రావే సూరీడూ."

ఆయన ముద్దుగా పిలవడం, అ న్నె ళ్ళు వచ్చిన సూరమ్మగారు 'ఆఁ!' అని వయ్యారంగా పలకడం దాసుగారి నడుం చుట్టూ చెయ్యివేసి సూరమ్మగారు నడిపించడం - ఎంత ప్రేమ!

ఎదురుగుండా గోడమీద రెండు పిల్లులు దెబ్బలాడుకుంటున్నాయి "అయ్యో ఎలా బకిరేసుకుంటున్నాయో" అంది రాజ్యం, "కాదు రాజ్యం. అదంతా సరసం. అందుకే పిల్లి దాంపత్యమంటారు" అన్నాను నేను.

# 'అర్ధాంగి' నిర్వచనం

"నాగశ్రీ"

ఈమధ్య నా స్నేహితుడొకడు చాల దినాలకు కనబడి "ఏంరా! అంతా క్షేమమేనా?" అని కుశలప్రశ్న వేశాడు. "ఏడిశావు. ఈమధ్యరోజుల్లో క్షేమాలేమిట్రా నీ తెలివి మండిపోను" అనగానే వాడు బిత్తరపోయి చూశాడు. మరి అంతకంటె నేనేం జవాబుచెప్పేది? వుద్యోగం సంగతి చూద్దామా అంటే ఆఫీసరు చేతిలో రోజూ తిట్లే వచ్చేజీతం చూద్దామాఅంటే సంసారానికి పదిహేను రోజుల ఖర్చులకు చాలదు. వెనకటికి మా చిన్నాయనొకాయన అన్నాడులే "ఈకాలపు కుర్రవెధవలకు సంసారాన్ని పొదుపుగా ఎలా జరుపుకోవాలో తెలియనే తెలియదు. ఒకడు చెప్పినా గ్రహించుకొనేపాటి జ్ఞానమైనా లేదు. వచ్చేజీతం చాలకపోతే వేరే సంపాదనకెలాగైనా మార్గం చూడాలి. అదేమీ లేనే లేదు. మాకు చాలటంలేదండీ అని ఏడుస్తారు వెధవలు" మరి ఆయన చెప్పింది కూడ నిజమే. ఆయనలాగ బియ్యం బ్లాకు మార్కెట్టులో అమ్మి సంపాయించే మార్గం మాకెలాగ తెలుస్తుంది? ఎవరొచ్చి అడిగినా బియ్యం దొడ్డిదారిన అమ్ముతాడు గాని నేను పోయి "బాబాయ్ ఇంట్లో చాల ఇబ్బందిగా వుంది. రెండుశేర్ల బియ్యముంటే సర్దండి" అంటేసరి "అబ్బే లేవురా నాయనా. కావాలంటే చూసుకో ఈ ముండుగదిలో. ఈ కేసను బియ్యం ఏ మూలకొస్తాయిరా. అప్పటికీ మీ పిన్ని తెలివైంది గనుక్కి ఎలాగో నెట్టుకొస్తూంది" అంటాడు. నాకూ తెలుసు ముందుగదిలో ఏమీ వుండవని. అవి వుండే ప్రదేశాలే వేరు. వాటిని సాయంచేసే మార్గాలే వేరు. ఈ పరిస్థితుల్లో నాకేంచేయాలో పాలుబోయేదికాదు. అప్పటికీ నేను కొంత తెలివైనపనే చేశానన్న మాట. మాయింట్లో నేనూ, మా గృహిణీ చంటిపిల్లాడు మాత్రమే అయినా చనిపోయిన మా అమ్మా నాన్నను బ్రతికించి రేషనులెక్కల్లో చేర్పించా. ఎన్ని తంటాలుపడితే మాత్రం ఏం లాభం? ఇంట్లో సతీమణి నా అసమర్థతను గురించి చేసే రిమార్కులు మాత్రం తగ్గలా. ఈ ఆడాళ్ళతో వేగలేమురా బాబూ అనిపించింది. ఎక్కడ తిరిగినా, ఎన్నితంటాలుపడ్డా బియ్యం దొరక్కపోతే నన్నేం గంగలో దూకమన్నారా? విసుగెత్తిపోయింది ప్రాణం. ఆలోచించి ఆలోచించి పెద్ద రాజకీయ దురంధరుడి